











కొత్తగా 348 మందికి పింఛన్లు

నిడదవోలు రూరల్: మండలంలోని 22 గ్రామ సచివాలయాల పరిధిలో 348 మందికి కొత్తగా పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ టి.మూర్తిబాబు శనివారం తెలిపారు. అట్లపాడు 6, డి.ముప్పవరం 18, గోపవరం 9, కంసాలిపాలెం 11, కాటకోటేశ్వరం 17, కోరుమామిడి 34, కోరుపల్లి 11, మునిపల్లి 21, పందలపర్రు 33, పెండ్యాల 16, పురుషోత్తపల్లి 21, రావిమెట్ల 14, సమిశ్రగూడెం 47, శెట్టిపేట 10, సింగవరం 10, తాడిమళ్ల 28, తాళ్లపాలెం 6, తిమ్మరాజుపాలెం 20, విజ్జేశ్వరం 16 పింఛన్లు మంజూరయ్యాయని ఆయన వివరించారు.

పింఛన్లను కొనసాగించాలి

ఉండ్రాజవరం: నిబంధనల పేరుతో పేదలకిస్తున్న సామాజిక పింఛన్లను రద్దు చేయవద్దని సీపీఎం మండల కార్యదర్శి తూరుగోపు వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ డిమాండ్‌తో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆ పార్టీ శ్రేణులతో కలసి శనివారం ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ జి.కనకరాజుకు శనివారం వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల పింఛన్లను ప్రభుత్వం మానవతా దృక్పథంతో కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండలశాఖ అధ్యక్షుడు వీరవల్లి సుబ్బారావు, కల్లుగీత కార్మిక సంఘం నాయకుడు గుబ్బల వీరరాఘవులు, కేవీపీఎస్ నాయకులు రాయుడు సువర్ణరాజు, మాగాపు తాతారావు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేపై రైతులకు అవగాహన

నల్లజర్ల: రైతుల పంట భూముల వివరాలను పక్కాగా నమోదు చేసి భవిష్యత్తులో భూ వివాదాలు రాకుండా నివారించాలన్నదే జగనన్న భూరక్ష-భూహక్కు పథకం ఉద్దేశమని నల్లజర్ల వీఆర్వో వి.లక్ష్మణమూర్తి రైతులకు వివరించారు. రీ సర్వేపై క్షేత్రస్థాయిలో రైతులకు శనివారం నల్లజర్లలో ఆయన అవగాహన కల్పించారు.భూ సమస్యలు నూరు శాతం పరిష్కరించి దస్త్రాలు సరి చేస్తామన్నారు.ప్రతి రైతు భూముల సర్వే నంబరు, దస్తావేజులు, భూమి పట్టాదారు పాస్‌బుక్‌లను పరిశీలిస్తారన్నారు. సబ్ రిజిస్ట్రారు కార్యాలయం నుంచి ఆన్‌లైన్‌లో రికార్డులు తీసుకొని మ్యుటేషన్ చేస్తారన్నారు. ఆయనతో పాటు సచివాలయ సర్వే బృందం కూడా పాల్గొంది.

బైబిల్ మిషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు

నిడదవోలు: ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ కాలనీలో బైబిల్ మిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తండ్రి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సాసీపీ సీనియర్ నాయకుడు జీఎస్ రావు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ దైవజనులు ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, పాస్టర్ రెవరెండ్ ఈ. విజయరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, పాస్టర్లు మద్దాల మహిమరాజు, పి. శేఖర్‌బాబు, సంఘస్తులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు విధిగా గృహాలు నిర్మించుకోవాలి

ఉండ్రాజవరం: ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో లబ్ధిదారులు తప్పనిసరిగా ఇళ్లు నిర్మించుకోవాలని ఎంపీడీఓ ఎ. శ్రీనివాసు సూచించారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం మండలంలోని దమ్మెన్ను సచివాలయం వద్ద సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ అధ్యక్షతన గృహ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ విక్టర్‌బాబు మాట్లాడుతూ ఆర్థిక స్థోమత లేని లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న నిర్మాణ సామగ్రితో తమకు కేటాయించిన స్థలాల్లో కనీసం రెండు గదులు నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ లక్షణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొఫెసర్ ఆనంద స్వరూప్‌కు సత్కారం

నల్లజర్ల: మండలంలోని చీపురుగూడెంకు చెందిన ప్రొఫెసర్, సామాజికవేత్త వసంతాడ ఆనంద్ స్వరూప్‌కు ఆత్మీయ సత్కారం లభించింది.తాడేపల్లిగూడెంలోని విశ్వవిజ్ఞాన ఆధ్యాత్మిక పీఠం ఆశ్రమ ఆవరణలో శనివారం డైమండ్ లయన్స్ క్లబ్ పర్యవేక్షణలో ఆరా ఫౌండేషన్ 4వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా పలువుర్ని ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీతల్లో ఫ్రొఫెసర్ ఆనంద్ స్వరూప్ కూడా ఉన్నారు.


ఆనంద్ స్వరూప్‌ను సత్కరిస్తున్న ఆరా ఫౌండేషన్ సభ్యులు

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నిడదవోలు రూరల్: మండలంలోని వివిధ సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న పది వలంటీర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు జనవరి 3వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ టి.మూర్తిబాబు శనివారం తెలిపారు. అట్లపాడు 1, గోపవరం 5, కాటకోటేశ్వరం 1, సింగవరం 1, తాడిమళ్ల 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, 35 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలని ఆయన సూచించారు.























క్లుప్తంగా

డీసీసీబీ క్యాలెండర్ ఆవిష్కరించిన హోం మంత్రి

కొవ్వూరు: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) 2023 క్యాలెండర్‌ను రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత శనివారం ఆవిష్కరించారు. లిటరరీ క్లబ్‌లో నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో పట్టణంలో ఆమె క్యాలెండర్‌ను ఆవిష్కరించి, అందరికీ ప్రతులను అందజేశారు. మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, పార్టీ నాయకులు సుంకర సత్యనారాయణ, ముదునూరి నాగరాజు, రుత్తల భాస్కరరావు, నగ్లపాటి శ్రీనివాసరావు, ఏలూరి విజయలక్ష్మి, మారిన రామకృష్ణ పాల్గొన్నారు.

దండలు వద్దు.. విద్యాసామగ్రితో రండి

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: తనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికి వచ్చే నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, బంధుమిత్రులు పూలదండలు, బొకేలు తీసుకురావద్దని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు, పెన్నులు వంటి విద్యా సామగ్రి తీసుకు రావాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లోని పేద విద్యార్థులకు ఆ విద్యాసామగ్రిని అందజేస్తామని చెప్పారు. తన క్యాంపు కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరూ మాస్కు ధరించాలని కోరారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు.

విద్యార్థినులకు ముగ్గుల పోటీలు



విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

నల్లజర్ల: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా నల్లజర్లలోని సర్వేపల్లి రాధాకృష్ణ సహకార జూనియర్, డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 45 టీములు పాల్గొన్నాయి. న్యాయనిర్ణేతగా కళాశాల డైరెక్టర్ కంఠమణి వసుంధరాదేవి వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో డిగ్రీ, జూనియర్ కళాశాలల చైర్మన్ కంఠమణి నారాయణ ప్రసాద్ ప్రిన్సిపాళ్లు ఎస్.సుబ్రహ్మణ్యం, సీహెచ్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై వినతి

కొవ్వూరు: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలపై ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి డి.మమ్మీకి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఏఎఫ్‌టీయు) ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు.యూనియన్ కొవ్వూరు శాఖ కన్వీనర్ మంగతాయారు, సలహాదారు ఈమని మల్లిక ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు.ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలని, గ్రాట్యుటీ, ఇతర సౌకర్యాలపై సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలని, మినీ అంగన్‌వాడీ కేంద్రాల వ్యవస్థ రద్దు, పెండింగ్ బిల్లులు, మోనో చార్జీలు, గ్యాస్ బిల్లులు అందించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు.

నేడు దేవరపల్లిలో ఎక్సైజ్ కార్యాలయం ప్రారంభం

దేవరపల్లి: స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సర్కిల్ కార్యాలయం దేవరపల్లిలో ఏర్పాటు కానుంది. జిల్లాల విభజనలో భాగంగా గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి మండల కేంద్రానికి పోలీస్ సర్కిల్ కార్యాలయం, ఎస్ఈబీ కార్యాలయాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. పోలీస్ సర్కిల్ కార్యాలయం ప్రారంభం కాగా, ఎస్ఈబీ కార్యాలయాన్ని గోపాలపురం రోడ్డులోని ప్రశాంతి కాలనీలో నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం ఉదయం 10.30 గంటలకు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎస్ఈబీ ఏఎస్పీ పి.సోమశేఖర్ ప్రారంభిస్తారని సీఐ వీటీవీవీ సత్యనారాయణ శనివారం తెలిపారు. మండలంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు. అలాగే నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాలకు ఎస్ఈబీ సర్కిల్ కార్యాలయాన్ని నిడదవోలులో ప్రారంభిస్తున్నట్టు ఆయన తెలిపారు.

నేటి నుంచి ఇంటింటికీ ఉచిత రేషన్ బియ్యం

దేవరపల్లి: జనవరి నెల ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీ ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి ప్రారంభం అవుతుందని తహసీల్దార్ ఎం.రామకృష్ణ తెలిపారు. బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తారని, కార్డుకు కిలో కందిపప్పు రూ.67, అర కిలో పంచదార రూ.17 రేటుకు ఎండీయూ ఆపరేటర్లు పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు. అన్ని రేషన్ దుకాణాల్లో సరుకులు పంపిణీకి సిద్ధంగా ఉంచినట్టు ఆయన తెలిపారు.

డైట్ ఆధునీకరణ



దూబచర్లలోని డైట్ కళాశాల

- 'నాడు–నేడు' కింద రూ.కోటి కేటాయింపు
- వాటర్ ట్యాంక్ నిర్మాణానికి రూ.40 లక్షలు
- చురుగ్గా మరుగుదొడ్ల నిర్మాణం



నిర్మాణంలో శౌచాలయాలు

నల్లజర్ల: మండలంలోని దూబచర్ల ఉపాధ్యాయ శిక్షణ సంస్థ (డైట్) సరికొత్త వసతులను సమకూర్చు కుంటోంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు పథకంలో రూ.కోటి విడుదల చేసింది. ఇప్పటికే ఆధునీకరణ చురుగ్గా జరుగుతున్నాయి. విద్యార్థినీ విద్యార్థులకు వేర్వేరుగా మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. హాస్టల్ భవనం వద్ద పక్కా డ్రైన్ నిర్మాణం ఇప్పటికే పూర్తయింది.కళాశాల నుంచి హాస్టల్ వరకూ కాలిబాట (పాత్ వే) నిర్మిస్తున్నారు. రూ.40 లక్షల వ్యయంతో రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ప్రధాన భవనానికి అక్కడక్కడా ఏర్పడిన శ్లాబ్ లీకేజీలను ప్రత్యేక లిక్విడ్‌తో పూడుస్తారు. విద్యుత్తు వైరింగ్, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. మరికొన్ని మేజర్ అండ్ మైనర్ పనులు చేపట్టనున్నారు. ఈ పనులన్నీ పేరెంట్స్ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. 1992లో అప్పటి శాసన సభ్యుడు చావా రామకృష్ణారావు ఆధ్వర్యంలో ఇక్కడ భవన నిర్మాణాలు జరిగాయి. పాతబడిన ఈ సంస్థ భవనాలకు ఇప్పుడు మరమ్మతులు చేయిస్తున్నారు. దానికితోడు పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పిస్తున్నారు.ఈ విద్యాసంస్థలో ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు బోధన పద్ధతుల మెరుగుదలకు వృత్యంతర శిక్షణతో పాటు డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్ఈడీ) ఉపాధ్యాయ శిక్షణ అమలు జరుగుతోంది.

ఏలూరు కోటదిబ్బ నుంచి..

విద్యావ్యాప్తికి అవసరమైన ఉపాధ్యాయుల శిక్షణ కోసం ఏలూరులోని కోటదిబ్బ వద్ద ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం (టీటీసీ) ఉండేది. రూ.50 లక్షల వ్యయంతో నూతన భవనాలు నిర్మించి 1992లో దానిని నల్లజర్ల మండలంలోని దూబచర్లకు మార్చారు. నాటి టీటీసీ కాస్తా 1998లో జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్)గా రూపాంతరం చెందింది. ఇంటర్‌లో అత్యధిక మార్కులు లభించిన వారికి కేటాయించే సీట్లను డైట్ సెట్‌లో వచ్చే ర్యాంకుల ఆధారంగా ఇచ్చేలా మార్పు చేశారు. అటు తర్వాత ఈ శిక్షణ కాస్తా డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్ఈడీ)గా వ్యవహారంలోకి వచ్చింది. ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాల విద్యార్థులకు ఇక్కడ సీట్లు కేటాయిస్తారు. హాస్టల్ సౌకర్యం ఉంది.

త్వరితగతిన పనుల పూర్తి



డైట్ కళాశాలలో అవసరమైన అన్ని వసతులకు అవసరమైన అంచనాలు రూపొందించాక, ఉన్నతాధికారుల ఆమోదంతో పనులను ప్రారంభించాం. దాదాపు 50 శాతం పనులు జరిగాయి. త్వరలోనే పనులను పూర్తిచేస్తాం.

ఎం.రాజ్‌కుమార్.ఏఈ, సమగ్ర శిక్ష అభియాన్

నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాలు



డైట్ కళాశాలలో అన్నిరకాల మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. అవసరమైన భవనాలకు నాడు–నేడు నిధులతో మరమ్మతులు చేయిస్తున్నాం. ఛాత్రోపాధ్యాయుల హాస్టలు భవనాలకు అవసరమైన పనులను కూడా చేయిస్తున్నాం. కొత్తదనం ఉట్టి పడేలా రంగులు వేయించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నాం.

పీవీ రమణమూర్తి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, డైట్, దూబచర్ల

వలంటీర్లే వారధులు

- హోం మంత్రి తానేటి వనిత
- కొవ్వూరులో కన్వీనర్లు, వలంటీర్లతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ క్షేత్రస్థాయిలో సంక్షేమ ఫలాలు అందించడంలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వలంటీర్లు వారధులుగా పని చేస్తున్నారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. కొవ్వూరు మండలం, పురపాలక సంఘం, చాగల్లు మండలాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో వేర్వేరుగా మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలోని లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన ఈ సమావేశంలో ఆమె మాట్లాడారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలపై సంక్షేమ పథకాలను అందించే పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఎలాంటి సిఫార్సులు లేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయన్నారు. ప్రతి వలంటీర్ ఆయా సచివాలయ కన్వీనర్లను సమన్వయ పరుచుకుంటూ లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు, పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏయే కుటుంబాలకు ఏయే పథకాల ద్వారా ఎంత మేరకు లబ్ధి చేకూరిందో వివరించాలన్నారు. రానున్న 15 రోజుల్లో వలంటీర్లతో పాటు మరో ఇద్దరు గృహ సారథులను నియమించనున్నట్టు మంత్రి వనిత ప్రకటించారు. పార్టీ అధిష్టానం ఆదేశాలను క్షేత్రస్థాయిలో తూచా తప్పకుండా అమలు చేయాల్సిన బాధ్యత కన్వీనర్లపై ఉందని స్పష్టం చేశారు. స్థానిక నాయకులు, కార్యకర్తల ద్వారా ఏవైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. వలంటీర్లకు, కన్వీనర్లకు అన్నీ వేళలా అండగా ఉంటామని ప్రకటించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ , ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, రుత్తల భాస్కరరావు, దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, నాయకులు చౌటుపల్లి వీరన్న, ఉప్పులూరి సూరిబాబు, సొసైటీ అధ్యక్షులు మారిన రామకృష్ణ, దేవగుప్తాపు లక్ష్మణరావు, నాయకులు గోలి శ్రీనివాస్, గొరిజాల పేర్రాజు, ఏలూరి విజయలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తాళ్లపూడి మండలంలో..

తాళ్లపూడి: సంక్షేమ పథకాల అమలులో గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు జగనన్న సైన్యంలా పనిచేయాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. బల్లిపాడులోని కాకర్ల రామయ్య కల్యాణ మండపంలో శనివారం మండలంలోని గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో మంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, సర్పంచులు ఎల్లిన శివ, కొమ్మిరెడ్డి పరశురామారావు, గండి రాంబాబు, తిరిగిపల్లి వెంకటరావు, నాయకులు పోశిన శ్రీకృష్ణదేవరాయలు, కుంటముక్కల కేశవనారాయణ, నక్కా చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదరికం పోవాలంటే మళ్లీ జగనన్నే రావాలి



సచివాలయ కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- నిడదవోలు మండల సచివాలయ కన్వీనర్లతో భేటీ

నిడదవోలు రూరల్: రాష్ట్రంలో పేదరిక నిర్మూలన జరగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు.మండలంలోని వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, నాయకులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తిమ్మరాజుపాలెంలోని తిరుచానూరు పద్మావతి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి గ్రామ స్వరాజ్య స్థాపనకు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లి వారితో మమేకం కావాలన్నారు. వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అన్నారు. ఎవరికీ భయపడకుండా పనిచేయాలని సూచించారు. ప్రతి సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లను నియమించామని, అలాగే ప్రతి 50 ఇళ్ల ఇద్దరు గృహ సారథులను ఎంపిక చేస్తామని చెప్పారు. అనంతరం గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు చీర్ల రాధయ్య, ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీలు కానుబోయిన ప్రభావతి, వడలి రత్నకుమారి, కో–ఆప్షన్ సభ్యురాలు గౌసియా బేగం, వైఎస్సార్ సీపీ నాయకులు ముళ్లపూడి శ్రీనివాస్‌కుమార్ చౌదరి, యాళ్ల రామారావు, సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా న్యూ ఇయర్ జోష్..

- కళకళలాడిన మార్కెట్లు
- పండ్లు, పూల బొకేలకు పెరిగిన డిమాండ్
- కేక్‌లు తయారీలో బేకరీలు బిజీ..బిజీ



నల్లజర్ల మార్కెట్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పండ్లు



తాళ్లపూడిలో అమ్మకానికి అందమైన కేక్‌లు



నిడదవోలు పట్టణంలో పూలదుకాణాల వద్ద సిద్ధంగా ఉన్న బొకెలు, దండలు



ముగ్గులు వేసేందుకు నిడదవోలు మార్కెట్‌లో విక్రయిస్తున్న ముగ్గులు

నిడదవోలు/నల్లజర్ల/ తాళ్లపూడి/ చాగల్లు: కాలగర్భంలో మరో ఏడాది కరిగిపోయింది. గతేడాది చేదు, తీపి స్మృతులను నెమరు వేసుకుంటూ కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టేందుకు ప్రజలు సంసిద్ధులవుతున్నారు. గ్రామాల్లోను, పట్టణాల్లోను నూతన సంవత్సర సందడి నెలకొంది. ప్రధాన కూడళ్లలో తమ నాయకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ వివిధ రాజకీయ పార్టీల స్థానిక నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. నిడదవోలు టౌన్‌తో పాటు నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల ప్రజలు కోటి ఆశలతో కొత్త ఏడాదికి స్వాగతించేందుకు సన్నద్ధం అయ్యారు. పట్టణంలో ఏ సెంటర్ చూసినా తమ స్థోమతను బట్టి ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేసుకుంటున్నారు. పూలు, పండ్లు, స్వీట్లు, కేకులకు డిమాండ్ ఏర్పడింది. నాయకులకు, అధికారులకు శుభాకాంక్షలు తెలిపేందుకు పూల వ్యాపారులు బొకేలను సిద్ధం చేశారు. బేకరీ యజమానులు సైతం రకరకాల నమూనాలలో అందర్నీ ఆకర్షించేలా కేక్‌లు తయారు చేశారు.నల్లజర్లలో కిలో కేక్ ధర రూ.200 నుంచి రూ.300 వరకూ పలుకుతోంది. ఇక నిడదవోలులో సాధారణ కేక్ కేజీ రూ. 300 , కూల్ కేక్ కేజీ రూ.600కు వ్యాపారులు విక్రయిస్తున్నారు. పూల ధరలు ఈఏడాది బాగా తగ్గుముఖం పట్టడంతో వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాధారణ బొకెల రకాలు బట్టి రూ. 100 నుండి రూ. 500 వరకు విక్రయిస్తున్నారు. పూల దండలు రూ. 80 నుండి 150 వరకు ధరలు పలుకుతున్నాయి. యాపిల్, కమలాఫలాల ధరలు బాగా పెరిగాయి. మరోపక్క శనివారమైనప్పటికీ మందుబాబులు, ముక్కల ప్రియుల కోసం వీధుల్లో బిర్యానీ స్టాల్స్ వెలిశాయి. ప్రత్యేక ప్యాకేజీలతో విక్రయాలు జరిగాయి. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ పలువురు మెసేజ్‌లు పంపడంలో నిమగ్నమయ్యారు.తాళ్లపూడి మార్కెట్‌లో బేకరీలు, పూలు, పండ్లు, రంగులు, వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో శనివారం కళకళలాడాయి. చాగల్లు మండలంలోని పలుచోట్ల ఫుడ్ ఆఫర్లు పెడుతూ శనివారం బిర్యానీ సెంటర్లు వెలిశాయి. హోటళ్ల నిర్వాహకులు వివిధ రకాల మాంసాహార వంటకాలను తయారుచేశారు.

వాకిళ్లలో రంగ వల్లులు

2022కి వీడ్కోలు పలుకుతూ 2023కి స్వాగతం పలుకుతూ ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులతో అలరించేందుకు మహిళలు సన్నద్ధం అవుతున్నారు. ఇందుకు అవసరమైన రంగులను మార్కెట్లో విక్రయిస్తున్నారు. నూతన సంవత్సరం వేళ ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు విద్యుత్తు దీపాలతో చర్చిలను అలంకరించారు.


కోటి జన్మల పుణ్యం.. శ్రీవారి గిరి ప్రదక్షిణ

- నేడు ద్వారకాతిరుమలలో వేడుక
- స్వామివారి పాదుకా మండపం వద్ద 2.30కు ప్రారంభం
- క్షేత్రంలో పూర్తయిన ఏర్పాట్లు



గిరి ప్రదక్షిణకు సిద్ధంగా శ్రీవారి ధర్మ ప్రచార రథం

శ్రీవారు, అమ్మవార్లు



ద్వారకాతిరుమల: కోటి జన్మల పుణ్యం శ్రీవారి గిరి ప్రదక్షిణ. స్వామివారి వైభవాన్ని చాటే వేడుక గిరి ప్రదక్షిణ. అలాంటి వేడుకను గజ, అశ్వ, వృషభ సేవలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, భక్తుల గోవింద నామ స్మరణలు, శ్రీవారి ధర్మ ప్రచార రథం, కోలాట భజనల మధ్య ఆదివారం వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అన్ని ఏర్పాట్లూ చేసింది. ఏటా ముక్కోటి ఏకాదశి పర్వదినం ముందు రోజు ఈ వేడుకను జరపడం సంప్రదాయం. ఈ క్రమంలోనే ఈ ఏడు కూడా గిరి ప్రదక్షిణను వైభవంగా జరపనున్నారు. ఈ పనులను ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు పర్యవేక్షిస్తున్నారు.

గిరి ప్రదక్షిణ జరిగేదిలా..

చినవెంకన్న గిరి ప్రదక్షిణ వేడుక ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి అంగరంగ వైభవంగా జరగనుంది. తొలుత స్వామివారి పాదుకా మండపం వద్ద ఈ కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ ఎస్వీ.సుధాకరరావు, ఈఓ త్రినాథరావు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభిస్తారు. అనంతరం ఈ యాత్ర మల్లేశ్వరం (దొరసానిపాడు రోడ్డు) మీదుగా కొండపైకి చేరుతుంది. అక్కడి నుంచి ఉగాది మండపం మీదుగా తిరిగి ఆలయానికి చేరుతుంది. ఆ తరువాత ఈ గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులందరికీ ఆలయ అధికారులు స్వామివారి నిజ రూప దర్శన భాగ్యాన్ని కల్పిస్తారు.

భక్తులకు అందే సేవలు ఇవీ..

ఐదు కిలోమీటర్ల మేర సాగే ఈ గిరి ప్రదక్షిణలో భక్తులకు దేవస్థానం అన్ని సౌకర్యాలనూ కల్పించనుంది. మార్గం మధ్యలో మంచినీళ్లు, పండ్లు, టిఫిన్లు, టీలు అందించేలా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే ఆంబులెన్స్‌ను అందుబాటులో ఉంచనున్నారు. నడవలేని భక్తుల సౌకర్యార్థం ఆ మార్గంలో దేవస్థానం బస్సు ఏర్పాటు చేస్తున్నారు.

క్షేత్రంలో చేస్తున్న ఏర్పాట్లు ఇవీ..

గిరి ప్రదక్షిణ నిమిత్తం కొండ చుట్టూ ఐదు కిలోమీటర్ల మేర రోడ్డుకు మరమ్మతులు చేసి, శుభ్రం చేశారు. అలాగే భక్తులు సేదతీరేందుకు మార్గ మధ్యలో టెంట్లు ఏర్పాటు చేశారు. భక్తులు శ్రీవారిని దర్శించేందుకు వీలుగా ఆలయ ఆవరణలో తాత్కాలిక క్యూలైన్లు నిర్మించారు. ఉత్తర ద్వారాలను ముస్తాబు చేయడంతో పాటు, విద్యుద్దీప అలంకారాల పనులు తుది దశకు చేరుకున్నాయి. గోవింద స్వాములు ఇరుముడులు సమర్పించే ప్రాంతంలో తాత్కాలిక పందిళ్లను, హోమ గుండాన్ని నిర్మించారు. భారీగా లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేశారు. భక్తులందరికీ స్వామివారి ఉచిత అన్న ప్రసాదాన్ని అందించనున్నారు.



గిరి ప్రదక్షిణ మార్గం

క్షేత్రానికి చేరుకునేదిలా

వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు రైల్వే మార్గం గుండా ద్వారకాతిరువులకు 17 కిలో మీటర్ల దూరంలో ఉన్న భీమడోలు రైల్వేస్టేషన్‌కు చేరుకొని, అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులు, ఆటోల ద్వారా క్షేత్రానికి చేరుకోవాలి. అలాగే జిల్లాలోని ఏ ప్రాంతం నుంచి అయినా బస్సుల ద్వారా ఇక్కడకు చేరుకోవచ్చు.

వైభవాన్ని చాటేలా..



శ్రీవారి వైభవాన్ని చాటేలా గిరి ప్రదక్షిణను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం. ఈ వేడుకలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలి. అందుకు అనుగుణంగా క్షేత్రంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– వేంద్ర త్రినాథరావు, శ్రీవారి దేవస్థానం ఈఓ

పొగాకు తోటలకు మానుమచ్చ తెగులు

- ఎండిపోతున్న మొక్కలు
- 15 శాతం పంటకు తెగులు
- దిగుబడి తగ్గే అవకాశం



దేవరపల్లి మండలం సంగాయిగూడెంలో మాను మచ్చ, వెర్రి తలలు తెగుళ్ల సోకిన పొగాకు తోట

దేవరపల్లి: వాతావరణం అనుకూలించక పోవడంతో పొగాకు తోటలకు వివిధ రకాల తెగుళ్లు సోకుతున్నాయి. దాంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరో నెల రోజుల్లో రెలుపులు ప్రారంభం కానున్నాయి. ఈ దశలో తోటలకు తెగుళ్లు సోకడంతో రైతులు అయోమయంలో పడ్డారు. మానుమచ్చ, వెర్రితల తెగుళ్లు ఎక్కువగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. మానుమచ్చ వచ్చిన మొక్కలు పడిపోయి ఎండిపోతున్నాయని, వెర్రి తలలు సోకిన మొక్కలు ఎదుగుదల (గ్రోత్) ఉండడం లేదని రైతులు తెలిపారు. 10 నుంచి 15 శాతం మొక్కలకు మానుమచ్చ తెగులు సోకినట్టు చెప్పారు. తెగుళ్ల నివారణకు పొగాకు బోర్డు అధికారులు, ఐటీసీ శాస్త్రవేత్తలు మందులను సిఫారసు చేసినప్పటికీ ఈ దశలో ప్రయోజనం లేదని పొగాకు వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్ అన్నారు. ఎకరాకు సుమారు 800 మొక్కలు చనిపోయినట్టు ఆయన తెలిపారు. దీనివల్ల దిగుబడులు తగ్గుతాయన్నారు. నవంబరులో కురిసిన అధిక వర్షాలు, ప్రస్తుం వాతావరణం వల్ల తోటలు దెబ్బతిన్నట్టు ఆయన వివరించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతంలో గల ఐదు వేలం కేంద్రాల పరిధిలో 2023–24 సంవత్సరానికి 12,458 మంది రైతులు, 22,528 హెక్టార్లలో పొగాకు సాగు చేస్తున్నారు. 14,288 బ్యారన్లను అధికారులు రిజిస్ట్రేషన్ చేశారు. ఎండల తీవ్రత పెరిగితే కొంత వరకూ తెగుళ్లు తగ్గుతాయని రైతులు అంటున్నారు. మెట్ట ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంటగా రైతులు పొగాకును సాగు చేస్తున్నారు.

ముక్కోటికి ద్వారకా తిరుమల ముస్తాబు

ద్వారకా తిరుమల: ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి పర్వదినానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆయా ఆలయాల్లో భక్తులకు సోమవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనాలు కల్పించనున్నారు. శ్రీవారి గిరి ప్రదక్షిణ, ముక్కోటి ఏకాదశి వేడుకలకు ద్వారకా తిరుమల దివ్యక్షేత్రం సర్వాంగసుందరంగా ముస్తాబైంది. ఆలయ పరిసరాలు, రాజగోపురాలు విద్యుద్దీప కాంతుల్లో మెరిసిపోతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి గిరి ప్రదక్షిణ అట్టహాసంగా జరగనుంది. శ్రీవారి పాదుకా మండపం వద్ద మధ్యాహ్నం 2.30 గంటలకు గిరి ప్రదక్షిణ ప్రారంభం కానుంది. అలాగే ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి భక్తులకు శ్రీవారి ఉత్తర ద్వార దర్శన భాగ్యం కలగనుంది. ఉచిత దర్శనం, రూ.100, రూ.200 టికెట్ల ద్వారా వెళ్లే వారు.. పార్కింగ్ ప్రదేశంలోని జంట గోపురాల ప్రాంతంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూలైన్ల గుండా వెళ్లాలి. వీరు ఉత్తర రాజగోపురం మీదుగా ఆలయంలోకి ప్రవేశిస్తారు. రూ.300 టికెట్ల వారు వీఐపీ లాంజ్ పక్కన ఏర్పాటు చేసిన క్యూలైన్ గుండా వెళ్లాలి. వీరు దక్షిణ రాజగోపురం మీదుగా ఆలయంలోకి ప్రవేశిస్తారు. వీఐపీలు, వీవీఐపీలు పడమర రాజగోపుర ప్రాంతంలోని పాత కేశఖండనశాల వద్ద నుంచి ఏర్పాటు చేసిన క్యూలైన్ గుండా ఆలయంలోకి వెళ్తారు. ఆలయంలోని భక్తులు తూర్పు రాజగోపురం మీదుగా బయటకు వెళ్తారు. దర్శనం టికెట్లను క్యూలైన్లలోనే విక్రయిస్తారు. ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్లలో ప్రతి 50 మీటర్లకు ఒక అత్యవసర మార్గం ఏర్పాటు చేశారు.

రహదారులకు మహర్దశ



పెరవలి వద్ద నిడదవోలు- నరసాపురం ఆర్ అండ్ బీ రోడ్డు



అన్నవరప్పాడులో సిమెంట్ రోడ్డుగా వదలి-ముక్కామల ఆర్ అండ్ బీ రహదారి అభివృద్ధి..

- నియోజకవర్గంలో 90 రోడ్ల పునర్నిర్మాణం, విస్తరణ
- రూ.113 కోట్ల వ్యయం..
- తొలగిన ప్రయాణికుల ఇక్కట్లు

పెరవలి: నిడదవోలు నియోజకవర్గంలోని రోడ్లపై ప్రయాణించాలంటే ఒకప్పుడు వాహనదారులు హడలి పోయేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులు పూర్తిగా మారాయి. బ్రేక్‌పై కాలు వేయకుండానే వాహన చోదకులు ఇప్పుడు తమ వాహనాలను పరుగులు పెట్టిస్తున్నారు. ఒకప్పుడు అధ్వానంగా ఉన్న రోడ్లు ఇప్పుడు అద్దంలా మెరిసిపోతున్నాయి. జిల్లాలోని మరే నియోజకవర్గంలో వేయనన్ని రోడ్లు, ఖర్చు చేయనన్ని నిధులు ఈ నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం వెచ్చించింది. దీని వెనుక స్థానిక ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడి కృషి ఎంతో ఉంది. రూ.113 కోట్ల వ్యయంతో నియోజకవర్గంలోని ప్రధాన రహదారులతో పాటు లింక్ రోడ్లతో కలుపుకుని ఇప్పటి వరకూ 90 రహదారులను పునర్‌నిర్మించారు. ఇందుకోసం ఏకంగా రూ.113 కోట్లను ఖర్చు చేశారు. వాటిలో ప్రధానమైన నిడదవోలు- నరసాపురం ఆర్ అండ్ బీ రహదారికి రూ.42 కోట్లు, వదలి -ముక్కామల ఆర్ అండ్ బీ సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.22 కోట్లు వెచ్చించారు. అలాగే నిడదవోలు–యర్నగూడెం ఆర్ అండ్ బీ రోడ్డును రూ.6.50 కోట్లతోను, నిడదవోలు–విజ్జేశ్వరం, నిడదవోలు–పత్తిపాడు ఆర్ అండ్ బీ రహదారులను రూ.7 కోట్ల వ్యయంతో నిర్మించారు. దాంతో నియోజకవర్గంలోని ప్రధాన రహదారులన్నీ సర్వాంగ సుందరంగా తయారయ్యాయి. రెండేళ్ల క్రితం వరకూ ఈ రహదారులపై రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వచ్చేది.

ప్రధాన రోడ్ల నిర్మాణాలు పూర్తికావడంతో ఇక లింక్ రోడ్ల అభివృద్ధిపై ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు దృష్టి పెట్టారు. నియోజకవర్గంలోని వివిధ లింక్ రోడ్ల నిర్మాణానికి రూ.9 కోట్ల ఖర్చయ్యే ప్రతిపాదనలు సిద్ధం చేసి, ప్రభుత్వానికి సమర్పించారు.ఈ నిధులు మంజూరైతే నియోజకవర్గంలో రోడ్ల సమస్యే ఉండదంటున్నారు.

30 ఏళ్ల తరువాత నిర్మాణం

పెరవలి మండలంలో 30 ఏళ్ల తర్వాత నిడదవోలు- నరసాపురం, వదలి–ముక్కామల ఆర్ అండ్ బి రహదారుల పునర్ నిర్మాణాలు జరిగాయి. అదీగాకుండా గతంలో 18 అడుగుల వెడల్పున ఉండే నరసాపురం రోడ్డును ఇప్పుడు 24 అడుగులకు పెంచి నిర్మించారు. వదలి -ముక్కామల రోడ్డును సిమెంట్,కాంక్రీట్ రోడ్డుగా అభివృద్ధి చేయడంతో 12 గ్రామాల ప్రజలు సుఖంగా రాకపోకలు సాగించగలుగుతున్నారు.

ఎన్నికల హామీ మేరకే..



ఎన్నికల సమయంలో ప్రచారానికి వెళ్లినపుడు రోడ్లు, డ్రైన్లు నిర్మించాలంటూ ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులు వచ్చాయి. వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చాను. ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి పక్కా ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరు కావడంతో ప్రధాన రోడ్లను నిర్మించాను.

– జి. శ్రీనివాస్ నాయుడు, ఎమ్మెల్యే, నిడదవోలు

సుఖంగా రాకపోకలు



నిడదవోలు–నరసాపురం ఆర్ అండ్ బీ రహదారి గతంలో ఇరుకుగా ఉండేది. దాంతో గతంలో తరచూ ఏదో ఒక చోట ఎప్పుడూ ప్రమాదాలు జరుగుతూ ఉండేవి. ఇటీవల ఈ రోడ్డును వెడల్పు చేసి పునర్నిర్మించడంతో రాకపోకలు సుఖంగా సాగుతున్నాయి. ప్రమాదాలు బాగా తగ్గిపోయాయి.

– వీరా రాజు, నడుపల్లి, పెరవలి మండలం

సీసీ రోడ్డు అయ్యాక సమస్యలు తొలగాయి



లోగడ వదలి–ముక్కామల రోడ్డు గోతులమయంగా ఉండేది. రాకపోకలు సాగించేందుకు ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ రోడ్డును 22 అడుగులకు విస్తరించి సిమెంట్, కాంక్రీట్ రోడ్డు వేయడంతో ప్రయాణికులు సుఖంగా, తక్కువ సమయంలో గమ్యానికి చేరుకోగలుగుతున్నారు.

–నామన ఆంజనేయులు, కాకరపర్రు, పెరవలి మండలం

విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగిపై దౌర్జన్యం

ముగ్గురు లారీ డ్రైవర్లపై కేసు

కొవ్వూరు: విధి నిర్వహణలో ఉన్న జల వనరుల శాఖ ఉద్యోగిపై ముగ్గురు లారీ డ్రైవర్లు దౌర్జన్యానికి పాల్పడ్డారు. సీతంపేట జంక్షన్ వద్ద బ్యారేజ్‌పై శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. భారీ వాహనాల రాకపోకలను నియంత్రించే విధుల్లో ఉన్న జలవనరుల శాఖ హెల్పర్ నెల్లి ఆలీష్ రాజు బ్యారేజ్ మీదుగా భారీ వాహనాలకు అనుమతి లేదంటూ లారీలను అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన జిల్లి మెహన్‌కుమార్, జిల్లి రాజేంద్ర, నెల్లి రవికిషోర్ అనే ముగ్గురు లారీ డ్రైవర్లు ఆలీష్ రాజు తల, పీక పట్టుకుని బలంగా తోసేశారు. చంపుతామంటూ బెదిరించారు.

దాంతో ఆలీష్ రాజు రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో అటుగా చక్రు లోడుతో వెళుతున్న లారీ అతడి కాలిపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయమైంది. ఆయనను 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు ముగ్గురు లారీ డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు.

బార్ అసోసియేషన్‌లో న్యూ ఇయర్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యనారాయణ

కొవ్వూరు: పట్టణంలోని బార్ అసోసియేషన్‌లో నూతన సంవత్సర వేడుకలను శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు.సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు కేక్ కట్ చేశారు. జూనియర్ సివిల్ జడ్జి బాలాత్రిపుర సుందరీదేవి, సెకండ్ అడిషనల్ అండ్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె.శారదాంబ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నీరుకొండ సూర్యనారాయణ, కార్యదర్శి పీవీఎస్ మునేశ్వరరావు, న్యాయవాదులు, న్యాయవాద గుమాస్తాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

గోదావరి బాలోత్సవం లోగో ఆవిష్కరణ

ప్రకాశం నగర్: విద్యార్థుల్లో సృజనాత్మక నైపుణ్యం, ప్రతిభపటవాలను వెలికితీసేందుకు గోదావరి బాలోత్సవం ఒక చక్కటి వేదిక కాబోతుందని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అన్నారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఈఓ ఎస్.అబ్రహాంతో కలిసి ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు సామాజిక బాధ్యతగా గోదావరి బాలోత్సవ కార్యక్రమం ద్వారా రాజమహేంద్రవరం నగరం, గ్రామీణ మండలాలకు చెందిన విద్యార్థులకు 56 అంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య శేఖర్ ,రాజు, విజయగౌరీ, చిలుకూరి శ్రీనివాస్, ఐ.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.